సాక్షి
మహబూబాబాద్

ఆదివారం । 2 । మార్చి । 2025



21న 'భారత్ గౌరవ్' యాత్ర

దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు దక్షిణ మధ్య రైల్వే ఈ నెల 21న భారత్ గౌరవ్ పేరుతో రైలు యాత్రను ప్రారంభించనుంది.

- 8లో▸



ఎన్పీడీసీఎల్‌కు లీడర్ షిప్ అవార్డు

తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి పీఎస్‌యూ లీడర్ షిప్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ ఆపరేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంది.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

35.1° /18.8°

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉక్కపోత ఉంటుంది. రాత్రి ఆహ్లాదకరంగా మారుతుంది.



న్యూస్‌రీల్

సమయపాలన పాటించాలి



గార్ల: వైద్యసిబ్బంది సమయపాలన పాటిస్తూ సబ్‌సెంటర్లలో పిల్లలకు వ్యాక్సినేషన్ టీకాలు ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ లక్ష్మినారాయణ సూచించారు. శనివారం గార్లలోని పలు సబ్‌సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. స్థానిక సబ్‌సెంటర్‌లో వ్యాక్సిన్ మందులను పరిశీలించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బందిపై సహించేది లేదని హెచ్చరించారు.అనంతరం గార్లలోని పుట్టకోట బజారులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అంగన్‌వాడీ టీచర్లు,పిల్లల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.ఆయన వెంట వైద్యాధికారి రాజ్‌కుమార్ జాదవ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దేశప్రగతి బీజేపీతోనే సాధ్యం

- జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మహబూబాబాద్ అర్బన్: దేశప్రగతి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతిండంతో బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం వెంకటేశ్వర్లు మాట్లాడారు. 2014లో ఉమ్మడి జిల్లా బీజేపీ నాయకులు అప్పటి పౌర విమానశాఖ మంత్రికి వినతిపత్రం అందజేశారని, దీంతోనే కేంద్ర ప్రభుత్వం వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్‌ను అనుమతించిందన్నారు. మానుకోట జిల్లా కేంద్రంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచువల్ శ్యామ్‌సుందర్‌శర్మ, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గడ్డం అశోక్, సంపత్, పల్లె సందీప్‌గౌడ్, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ప్రజాప్రతినిధులు



మహబూబాబాద్ రూరల్: మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డికి మహబూబాబాద్ ప్రజాప్రతినిధులు శనివారం కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాదులోని జూబ్లీహిల్స్ సీఎం నివాసంలో కార్యాలయంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, కంకర అయ్యప్పరెడ్డి తదితరులు రేవంత్ రెడ్డికి బొకే అందజేశారు. వారివెంట వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు ఉన్నారు.

భరత్ చందర్ రెడ్డికి ఎమ్మెల్సీ ఇవ్వాలి

మహబూబాబాద్: డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను శనివారం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హైదరాబాదులో కలిసి విన్నవించారు.భరత్ చందర్ రెడ్డికి మహబూబాబాద్ జిల్లాలో దశాబ్దాల కాలం నుంచి కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కాపాడుతూ వస్తున్నారని వివరించారు.

రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ జేడీగా సాంబశివరావు


కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివేకానంద రీసెర్చ్‌స్కాలర్స్ హాస్టల్ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ అంకశాల సాంబశివరావు నియమితులయ్యారు. ఈమేరకు శనివారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను సాంబశివరావు అందుకున్నారు.

బీపీ.. షుగర్

జిల్లాలో పెరుగుతున్న బాధితులు

- మారిన జీవన విధానంతో ఇబ్బందులు
- శారీరక శ్రమ లేకపోవడం, ఆహారపు అలవాట్లు కారణం
- లైఫ్‌స్టైల్ మార్చకుంటే ముప్పేనంటున్న వైద్యులు





సాక్షి, మహబూబాబాద్: పాతతరం వాళ్లు వంద సంవత్సరాలు బతికేవారు.. చావు దగ్గరకు వచ్చినా.. ఆరోగ్య సమస్య ఉండేది కాదు. ఇందుకు కారణం.. ఉదయం నాలుగు గంటలకు నిద్రలేచింది మొదలు పొద్దస్తమానం పనిచేయడం, ఎటువంటి రసాయన ఎరువులు వేయకుండా పండించిన జొన్నలు, సజ్జలు, వరి, తాజా కూరగాయలు, ఆకుకూరలు తినడం. కడుపు నిండా తిని కాయకష్టం చేసి తిన్నది జీర్ణం చేసుకోవడం, కంటి నిండా నిద్ర పోవడం. ఇది వారి ఆరోగ్య రహస్యం. కానీ, ఇప్పుడు పుట్టిన బిడ్డ నుంచి పెద్దవారి వరకు వయస్సుతో సంబంధం లేకుండా బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్నారు. గిరిజనులు, ఆదివాసులు ఉన్న మానుకోట లాంటి జిల్లాలో కూడా అసంక్రమిత వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య గడిచిన పది సంవత్సరాల్లో రెట్టింపు అయినట్లు వైద్యులు చెబుతున్నారు.

పెరుగుతున్న బీపీ, షుగర్ పేషెంట్లు

జిల్లాలో బీపీ, షుగర్ బారిన పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ నిర్వహించిన అసంక్రమిత వ్యాధుల సర్వేలో ఈ చేదునిజం బయట పడింది. జిల్లాలోని 18 మండలాలు.. 21 పీహెచ్‌సీల పరిధిలో 30 సంవత్సరాలు నిండినవారు 4,78,472 మంది ఉన్నట్లు తేల్చారు. వీరిలో 4,24,139 మందికి షుగర్(డయాబెటీస్) పరీక్ష నిర్వహించగా.. 2,00,466 మందికి అనుమానంగా ఉందని భావించి తిరిగి పరీక్షించారు. దీంతో 31,070 మంది షుగర్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయింది. అదేవిధంగా 4,25,567 మందికి బీపీ (బ్లెడ్ ప్రెషర్) పరీక్షించగా సాధారణ స్థితి కన్నా హెచ్చు, తగ్గులతో 1,92,017 ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీరిని తిరిగి పరీక్షించగా 64,429 మందికి బీపీ మాత్రలు అవసరమని డాక్టర్లు తేల్చారు.

పదిశాతం మంది బాధితులే..

జిల్లాలోని పలు మండల్లాలో 30 సంవత్సరాలు నిండిన వారిలో పదిశాతం మంది బీపీ, షుగర్‌తో బాధపడుతున్నవారు ఉండడం గమనార్హం. ప్రధానంగా దంతాలపల్లి, నెల్లికుదురు, తొర్రూరు, గూడూరు, మరిపెడ, మహబూబాబాద్, ఇనుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎక్కువగా ఈ బాధితులు ఉన్నట్లు తేలింది.

అదే విధంగా.. కొత్తగూడ, గంగారం, ఉగ్గంపల్లి, కోమట్లగూడెం ప్రాంతాల్లో తక్కువ కేసులు నమోదు అయ్యాయి. అంటే ఏజెన్సీ ప్రాంతాలతో పోలిస్తే మైదాన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు బీపీ, షుగర్ వంటి వ్యాధులు ఎక్కువగా నమోదు అవుతున్నట్లు స్పష్టం అవుతుంది.

అలవాట్లల్లో మార్పు రావాలి



బీపీ, షుగర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మారిన ఆహారపు అలవాట్లు, మద్యం, పొగ తాగడం ప్రధాన కారణాలు. వీటితోపాటు ఆయా ప్రాంతాల్లోని ప్రత్యేక పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు మానసిక ఒత్తిడి కూడా బీపీ, షుగర్‌కు కారణం అవుతున్నాయి. ఆహారపు అలవాట్లలో మార్పు, ఒత్తిడిని తట్టుకునేలా అవగాహన పెంచడం ద్వారా బీపీ, షుగర్ నియంత్రణలో ఉంటాయి.

- మేరుగు సుధాకర్, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ, ప్రభుత్వ మెడికల్ కళాశాల

శారీరక శ్రమ అవసరం



బీపీ, షుగర్ పేషెంట్లు పెరుగున్న విషయం వాస్తవమే. శారీరక శ్రమ తగ్గడం, మోతాదుకు మించి ఆహారం తీసుకోవడం ప్రధాన కారణం. ఉరుకులు పరుగుల జీవితంలో అలసిపోవడం, మానసిక ఒత్తిడికి గురికావడం కూడా.. శారీరక శ్రమ అంటే కనీసం చెమటలు వచ్చేవిధంగా పనిచేయడం లేదా వ్యాయామం చేయడం, మితమైన, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. సాధ్యమైన మేరకు మాంసం తగ్గించాలి. సులభంగా జీర్ణమయ్యే ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. నిల్వ ఉంచిన పచ్చళ్లు తినొద్దు.

- డాక్టర్ కుమారస్వామి, ఎండీ, జనరల్ ఫిజీషియన్

పెద్ద చెరువు వద్ద స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు



వైభవంగా తెప్పోత్సవం

- పెద్దచెరువులో విహరించిన భద్రకాళీ సమేత వీరభద్రుడు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కురవి పెద్ద చెరువులో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఆలయం నుంచి చెరువు వద్దకు శావలో తీసుకొచ్చారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్లాస్టిక్ డబ్బాలతో తయారు చేసిన తెప్పకు విద్యుత్‌దీపాలంకరణ చేసి, ఉత్సవమూర్తులను ఉంచారు. ప్రధాన అర్చకుడు జలాలకు హారతినిచ్చి భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారిని తెప్పలో విహరింపజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యనారాయణ, చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, గణేష్, సోమ్లానాయక్, శక్రునాయక్, నాయకులు ఎర్ర నాగేశ్వర్‌రావు, మోహన్‌రావు పాల్గొన్నారు.



తెప్పోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

గిరిజన ధర్మకర్తను అడ్డుకున్న కానిస్టేబుల్

శనివారం రాత్రి నిర్వహించిన తెప్పోత్సవానికి హాజరైన ఆలయ ధర్మకర్త, గిరిజనుడు గుగులోత్ సోమ్లా నాయక్‌ను మెట్ల వద్ద డ్యూటీలో ఉన్న స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ నరేష్ అడ్డుకున్నాడు. 'నేను ధర్మకర్తను .. ఎందుకు ఆపుతున్నారు' అని అడిగినా వినకుండా ఎస్సై ఎవరినీ పంపించొద్దన్నారు.. పోనివ్వను.. అంటూ అడ్డుకోవడంతో అవమానంతో అక్కడే నిలబడి కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగాడు. పక్కనే ఓ ఎస్సై ఉన్నా చూస్తుండిపోయాడు. తెప్పోత్సవం పూర్తయ్యే వరకూ అక్కడే ఉండిపోయాడు. ఈ విషయమై ఎస్సై సతీష్‌ను వివరణ కోరగా తనకు విషయం తెలియదని చెప్పడం కొసమెరుపు.

యూడీఐడీ నంబర్లు జనరేట్ చేయాలి

- పంచాయతీరాజ్ కార్యదర్శి దివ్య

మహబూబాబాద్: దివ్యాంగులకు యూడీఐడీ నంబర్ జనరేట్ చేయాలని పంచాయతీరాజ్ కార్యదర్శి దివ్య అన్నారు. సదరం సర్టిఫికెట్లు, యూనిక్ డిసబిలిటీ ఐడీ జారీ, సోలార్ పవర్ ప్లాంట్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లకు బదులు యూనిక్ డిసబిలిటీ ఐడీ జారీ చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్‌పై ఇచ్చే శాతాన్ని యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, డీడబ్ల్యూఓ ధనమ్మ, మెడికల్ కాలేజీ సూపరింటిండెంట్ శ్రీనివాసరావు, ఆర్‌ఎంఓ డాక్టర్ జగదీశ్వర్ పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

రంజాన్ మాసానికి ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: రంజాన్ మాసానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షలు, రంజాన్ ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో జిల్లాలోని మసీదుల్లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇంటర్ మొదటి సంవత్సరం 4,395 మంది, ద్వితీయ సంవత్సరం 4,922 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో పని దినాలు, కూలీల సంఖ్య పెంచాలని తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనుల వివరాలు నమోదు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి, అధికారులు, ముస్లిం మత పెద్దలు , తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

కలర్‌ఫుల్.. ఫెస్ట్

నిట్ వరంగల్ వసంతోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ–25 వేడుకలు రెండోరోజు శనివారం కలర్‌ఫుల్‌గా సాగాయి. దేశవ్యాప్త వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ సంస్కృతీ సంప్రదాయాల ప్రదర్శనలలో పోటీ పడ్డారు. గీతామాధురి, మ్యాడ్–2 రాకతో ప్రోషో అదిరిపోయింది. కొరియో నైట్‌లో విద్యార్థులు స్టెప్పులతో సందడి చేశారు. ఈ వేడుకలు ఆదివారం ముగియనున్నాయి.

– కాజీపేట అర్బన్

- వివరాలు 8లో▸





కేరింతలు కొడుతున్న విద్యార్థులు

భద్రకాళి ఆలయ హుండీ ఆదాయం రూ.66 లక్షలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో శనివారం హుండీలోని కానుకలను లెక్కించగా.. 84రోజులకు రూ.66,00,196 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ శేషుభారతి తెలిపారు. 186 యూఎస్ డాలర్లు, 200 సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఓమన్ బైసా, 10 బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ పౌండ్స్, 1/2 సెంట్రల్‌బ్యాంక్ ఆఫ్ బెహరాన్ దినార్, 11 మలేషియా రెంగేట్స్, 15 యూరోలు, 10 యుఏఈ దిరమ్స్, ఒక సౌదీ అరేబియా రియాల్స్, ఒక ఖతర్ సెంట్రల్ బ్యాంక్ దినార్, 2 సింగపూర్ డాలర్లు, 2000 లాంజానియా కరెన్సీ లభించినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర విజిలెన్స్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- డీఈఓ రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ అర్బన్: టెన్త్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం ఐడీఓసీ కార్యాలయంలో డిపార్ట్‌మెంట్, చీఫ్ సూపరింటెండెంట్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. జిల్లాలో పది పరీక్షలకు బాలికలు 4,005 మంది, బాలురు 4,189 మంది హాజరవుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 46 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 46 మంది సీఎస్, 46 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే సిబ్బంది ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లు అనుమతి లేదన్నారు. ఏడీ రాజేశ్వర్, పరీక్షల నిర్వహణ అధికారి మందుల శ్రీరాములు, ఎఫ్ఎఓ మహాకాళి బుచ్చయ్య, డీసీఈబీలు బాలాజీ, సతీష్, సైన్స్ అధికారి అప్పారావు, ఎఎస్ఓ సంతోష్, సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 5వ తేదీ నుంచి పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మదార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రథమ సంవత్సరంలో జనరల్, ఒకేషనల్ కోర్సులో 4,365 మంది, ద్వితీయ సంవత్సరంలో జనరల్, ఒకేషనల్ కోర్సులో మొత్తం 4,922 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పర్యవేక్షణకు జిల్లా పరీక్షల కమిటీ,ఫ్లెయింగ్ స్క్వాడ్,రెండు సిట్టింగ్ స్క్వాడ్, 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు, సీసీ కెమెరాల మధ్య పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సందేహాలుంటే విద్యార్థులు టోల్ ఫ్రీ నంబర్ 92402 05555 ద్వారా సంప్రదించాలని సూచించారు. డీఈసీ సభ్యులు రాజకుమారి, కుమార్, పాక్కుల సదానందం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ విలేజ్‌కు విద్యార్థుల ఎంపిక



కేయూ క్యాంపస్: క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా కాకతీయ యూనివర్సిటీలోని వ్యాయామ కళాశాలకు చెందిన 8 మంది బీపీఈడీ విద్యార్థులు బెంగళూరులోని స్పోర్ట్స్ విలేజ్‌కు ఎంపికయ్యారు. ఈక్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 20 మంది బీపీఈడీ విద్యార్థులు రాత, మౌఖిక పరీక్షలకు హాజరయ్యారు. అందులో 8 మంది ఎంపికైనట్లు శనివారం ఆ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్ తెలిపారు. వీరు నాలుగో సెమిస్టర్ పూర్తి చేసిన అనంతరం బెంగళూరు స్పోర్ట్స్ విలేజ్‌లో విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరికి వార్షిక వేతనం రూ.3 లక్షలు ప్రారంభ వేతనం ఉంటుందని ఆయన తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్‌తోపాటు స్పోర్ట్స్ విలేజ్ బాధ్యులు నాగబాబు, శ్వేత అభినందించారు.

30 మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య కేంద్రం పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన ఆయా పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల్లో గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో 25 మంది, బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఐదుగురు మొత్తం.. 30 మంది కాపీయింగ్ చేస్తూ స్క్వాడ్‌కు పట్టుబడి డీబార్ అయినట్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ తెలిపారు.

రైతులతో రావేప్ విద్యార్థుల మమేకం

మహబూబాబాద్ రూరల్: గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం (రావెప్) లో భాగంగా మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం మమేకమయ్యారు. ఇందులో భాగంగా విద్యార్థులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామంలో రైతులతో ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులు చెప్పిన సమస్యలను నమోదు చేసుకున్నారు. గ్రామ స్థితిగతులను చిత్రపటాల ద్వారా రైతు వేదికలో వివరించారు. గ్రామ పంటల వివరాలు, సాంఘిక కార్యక్రమాలు, రవాణా సదుపాయాలు, ఆరోగ్య పరిస్థితులు, పంటల సాగు సమయంలో వచ్చే చీడపీడలు, నీటి వినియోగం పరికరాలు, నీటి వనరుల గురించి రైతులకు వివరించి తెలియజేశారు. కార్యక్రమంలో మల్యాల కేవీకే సమన్వయకర్త మాలతి, శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ కుమార్, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు శరత్‌చంద్ర, యశస్విని, మానస, ఏఈఓ రంజిత్ కుమార్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు శ్రీరాములు, కిరణ్, నరేష్ తదితరులున్నారు.



చిత్రపటాల ద్వారా రైతులకు వివరిస్తున్న విద్యార్థులు

రోడ్డు రోలర్ చోరీపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మానుకోట జిల్లా కేంద్రంలో రోడ్డు రోలర్ చోరీ జరిగిందని ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం ప్రాంతానికి చెందిన వాహన యజమాని భిక్షంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం ప్రాంతానికి చెందిన భిక్షంరెడ్డికి చెందిన రోడ్డు రోలర్‌ను అద్దెకు తీసుకునేందుకు ఫిబ్రవరి 23న ముగ్గురు వ్యక్తులు సంప్రదించారు. రూ.35 వేలతో అద్దెకు ఒప్పందం కుదుర్చుకోగా రూ.25వేలను భిక్షంరెడ్డికి ఫోన్ పే ద్వారా పంపించారు. అదే రోజున తమ వాహనాన్ని డ్రైవర్ అఫ్జల్‌తో మహబూబాబాద్ పంపించారు. మహబూబాబాద్ చేరుకున్న రోడ్డు రోలరును కురవి గేట్ ఆర్‌ఓబీ ప్రాంతంలో పార్కింగ్ చేసి ఉంచి వెళ్లిన డ్రైవర్.. తెల్లవారు రోజున వెళ్లి చూడగా.. ఆ వాహనం కన్పించలేదు. దీంతో డ్రైవర్ అఫ్జల్ తన యజమాని భిక్షంరెడ్డికి సమాచారం ఇచ్చాడు. దీంతో ఫిబ్రవరి 25న మహబూబాబాద్‌కు వచ్చిన యజమానికి.. పాత ఇనుప సామాన్ల దుకాణం ముందర రోడ్డు రోలర్ కన్పించింది. షాపు నిర్వాహకులను వివరాలు అడగ్గా వాహనాన్ని రూ.2.19 లక్షలకు ఓ వ్యక్తి విక్రయించినట్లు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు సీఐ వెల్లడించారు.

సీపీఆర్‌తో కండక్టర్‌ ప్రాణాలు కాపాడిన ఆర్టీసీ డ్రైవర్‌

చిల్పూరు: నైట్‌హాల్ట్‌ బస్సులో అర్ధరాత్రి కండక్టర్‌ ఒక్కసారిగా కుప్పకూలిపోగా పక్కనే ఉన్న డ్రైవర్‌ సీపీఆర్‌ చేసి ప్రాణాలు కాపాడారు. ఆర్టీసీ జనగామ డిపో మేనేజర్‌ స్వాతి, డ్రైవర్‌ ప్రసాద్‌ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. తరిగొప్పుల బస్సుకు చిల్పూరు మండలం కొండాపూర్‌లో నైట్‌హాల్ట్‌ ఉంది. రోజు మాదిరిగానే శుకవారం రాత్రి బస్సులో కండక్టర్‌ యాదయ్య, డ్రైవర్‌ బీఆర్‌.ప్రసాద్‌ కొండాపూర్‌ చేరుకున్నారు. రాత్రి భోజనం ముగించుకుని నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి కండక్టర్‌ యాదయ్య ఒక్కసారిగా అరుస్తూ వాంతులు చేసుకుంటూనే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో డ్రైవర్‌ ప్రసాద్‌ వెంటనే 108 అంబులెన్స్‌ సిబ్బందికి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇస్తూనే సీపీఆర్‌ చేయడంతో కండక్టర్‌ స్పృహలోకి వచ్చాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కండక్టర్‌ ఆరోగ్యం నిలకడగా ఉందని, సీపీపీ చేయడం వల్లే ప్రాణాపాయం తప్పిందని డాక్టర్లు అన్నారు. డ్రైవర్‌ ప్రసాద్‌ను డిపో మేనేజర్‌ స్వాతి అభినందించారు.

ఆశపడి.. మోసపోయాడు

● రూ.9.51 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

కమలాపూర్‌ : టెలిగ్రామ్‌ యాప్‌లో వచ్చిన టాస్క్‌లు ఆడితే జమ చేసిన మొత్తానికి రెట్టింపు నగదు వస్తుందని ఆశపెట్టారు.. ఓ యువకుడు నమ్మి రూ.9.51 లక్షలు పోగొట్టుకొని మోసపోయాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్‌ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్‌ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్‌ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన వట్టేముల మనోజ్‌ గత నెల 6న టెలిగ్రామ్‌ యాప్‌ ద్వారా భావి జోషి అనే అడ్రస్‌ నుంచి ఇందులో డబ్బులు జమ చేసి తాము చెప్పిన టాస్క్‌లు ఆడితే జమ చేసిన డబ్బులకు రెట్టింపు నగదు వస్తాయని మెసేజ్‌ వచ్చింది. దీనిని నమ్మిన మనోజ్‌ విడతల వారీగా మొత్తం రూ.9.51 లక్షలు డిపాజిట్‌ చేసి వారు నిర్దేశించిన టాస్క్‌లు ఆడాడు. ఎంతకూ తనకు రావాల్సిన రెట్టింపు నగదు రాకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. వెంటనే 1930కు కాల్‌ చేసి ఫిర్యాదు చేశాడు. శనివారం కమలాపూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ హరికృష్ణ తెలిపారు.

సైబర్‌ నేరం.. కేసు నమోదు

దోర్నకల్‌: తన ఖాతా నుంచి బలవంతంగా డబ్బు ట్రాన్స్‌ఫర్‌ చేయించిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. డోర్నకల్‌ సీఐ బి.రాజేశ్‌ కథనం ప్రకారం.. స్థానిక శాంతినగర్‌కు చెందిన వెంకటసాయి క్రెడిట్‌ కార్డు ద్వారా రూ.23 వేలు వాడుకున్నాడు. ఈ క్రమంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి క్రెడిట్‌ కార్డు అప్పు చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ ఐదు దఫాలుగా రూ.40 వేలు ట్రాన్స్‌ఫర్‌ చేయించుకున్నారు. అనంతరం ఇంకా డబ్బు చెల్లించాలని, లేనిపక్షంలో న్యూడ్‌ ఫొటోలు బంధువులకు పంపుతామని ఒత్తిడి తీసుకొచ్చాడు. దీంతో బాధితుడు వెంకటసాయి 1930 నంబర్‌ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసుల ట్రాన్స్‌ఫరైన డబ్బులో రూ.15,391 హోల్డ్‌ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజేశ్‌ తెలిపారు.

హ్యాండ్‌ ప్రింట్‌ .. ఇదే నా బ్రాండ్‌



నిట్‌ వరంగల్‌ వాల్యూ ఎడ్యుకేషన్‌ అండ్‌ ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో విద్యార్థులు హ్యాండ్‌ ప్రింటింగ్‌ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇదే నా బ్రాండ్‌ అంటూ పుష్ప సినిమా డైలాగ్‌తో అర చేతిని వివిధ రకాల రంగుల్లో ముంచి ముద్ర వేశారు. విద్యార్థులు పరస్పరం తమ హ్యాండ్‌ ప్రింట్‌ను 'టి' షర్ట్‌పై ఏర్పాటు చేసుకుని జ్ఞాపకంగా అందజేసుకున్నారు.

మట్టి పట్టు .. కుండ చేత పట్టు



స్ప్రింగ్‌ స్ప్రీ–25 వేడుకల్లో భాగంగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా ధర్మసాగర్‌ మండలం ఉనికిచర్లకు చెందిన సారయ్య సారథ్యంలో విద్యార్థులు పాట్‌ మేకింగ్‌ను ఉత్సాహంగా చేపట్టారు. కుమ్మరులు తమ కులవృత్తిని నేటి తరానికి అందజేసేందుకు మట్టిని పట్టు.. కుండలను తయారు చేసి చేత పట్టు అంటూ ఉత్సాహంగా కుండలు తయారు చేశారు.

నువ్వా? నేనా.. స్నేక్స్‌ అండ్‌ ల్యాడర్స్‌



నిట్‌ యూత్‌ రెడ్‌ క్రాస్‌ ఆధ్వర్యంలో స్ప్రింగ్‌స్ప్రీ–25లో భాగంగా చిన్నప్పుడు ఆడుకునే స్నేక్స్‌ అండ్‌ ల్యాడర్స్‌ను ఏర్పాటు చేశారు. కైలాసంలో నువ్వా? నేనా పాముకు నువ్వు బలి.. నిచ్చెనతో నేను గెలిచి అంటూ విద్యార్థులు పిల్లల స్నేక్స్‌ అండ్‌ ల్యాడర్స్‌ ఆటలో పాల్గొన్నారు.

కలర్‌ఫుల్‌.. ఫెస్ట్‌



అద్వితీయంగా 'నిట్‌' వసంతోత్సవం
● ఉత్సాహంగా పోటీ పడిన విద్యార్థులు
● గీతామాధురి, మ్యాడ్‌–2 సినిమా టీమ్‌ రాకతో ఫ్రోషో అదుర్స్‌
● కొరియో నైట్‌లో స్టెప్పులేసిన విద్యార్థులు
● నేటితో ముగియనున్న స్ప్రింగ్‌ స్ప్రీ–25 వేడుకలు

కాజీపేట అర్బన్‌ : నిట్‌ వరంగల్‌లో మూడు రోజుల వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ–25 రెండో రోజు శనివారం కలర్‌ఫుల్‌గా సాగాయి. దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్‌ కళాశాలల నుంచి హాజరైన పదివేల మంది విద్యార్థులు తమ ప్రాంత సంస్కృతీసంప్రదాయాలను పరస్పరం పంచుకుంటూ ఆకట్టుకున్నారు. రెండో రోజు కలర్‌ పెయింటింగ్స్‌, ఆర్ట్స్‌, హ్యాండ్‌ ప్రింటింగ్‌, పాట్‌ మేకింగ్‌, స్నేక్స్‌ అండ్‌ ల్యాడర్స్‌, మేజ్‌ రన్‌, స్ట్రీట్‌ ఫొటోగ్రఫీ, పోలరాయిడ్‌ ఫొటోగ్రఫీ, ఆర్ట్‌ థెరఫీ, తానాబానా, ట్రెజర్‌ హంట్‌, తదితర విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పోటీపడ్డారు.

నేటితో ముగియనున్న స్ప్రింగ్‌ స్ప్రీ–25..

నిట్‌లో విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహిస్తున్న మూడు రోజుల స్ప్రింగ్‌స్ప్రీ–25వేడుకలు ఆదివారం మూడో రోజుతో ముగియనున్నాయి. చివరి రోజు అల్యూర్‌లో భాగంగా ఫ్యాషన్‌ షో, డీజే నైట్‌, నుక్కడ్‌ నాటక్‌, బైక్‌ స్టంట్స్‌తో బైబై నిట్‌ అంటూ విద్యార్థులు స్ప్రింగ్‌ స్ప్రీ–25కు వీడ్కోలు పలుకుతారు.



పాడుతున్న సింగర్‌ గీతామాధురి

ఉర్రుతలూగించిన గీతామాధురి

నిట్‌ వరంగల్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ–25లో భాగంగా సింగర్‌ గీతామాధురి తన పాటలతో ఉర్రుతలూగించారు. మ్యాడ్‌–2 సినిమా టీమ్‌ రాకతో విద్యార్థులు కేకలు వేస్తూ ఉత్సాహంగా డ్యాన్స్‌లు వేశారు.

కళ్లకు గంతలు.. అయినా చేరుతా గమ్యం



కళ్లకు గంతలు కట్టినా మీరు చూపే మార్గంతో గమ్యాన్ని చేరుతానంటూ వసంతోత్సవ వేడుకల్లో ఏర్పాటు చేసిన మేజ్‌ రన్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. నిట్‌ యూత్‌ రెడ్‌క్రాస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేజ్‌ రన్‌ పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ మిత్రుడికి తామే కళ్లకు గంతలు కట్టి మార్గ నిర్దేశం చేసి గమ్యాన్ని చేర్పించి 'వీ ఆర్‌ ఫ్రెండ్స్‌' అంటూ ఎంజాయ్‌ చేశారు. నేను నా ఫ్రెండ్‌ను గుడ్డిగా నమ్ముతానని ఆనందం వ్యక్తం చేశారు.

నే శారీ కడితే...



సంస్కృతీ,సంప్రదాయాలను పరస్పరం విద్యార్థులు పంచుకునే వేదికగా నిలుస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ–25 వేడుకల్లో ఏక్‌ భారత్‌ శ్రేష్ఠ్‌ భారత్‌ ఆదర్శంగా భారతీయ ఆహార పద్ధతులు, వస్త్రధారణపై నేటి తరానికి అవగాహన కల్పించేందుకు విద్యార్థులు శారీ కట్టుకుని విద్యార్థినులకు దీటుగా ముస్తాబయ్యారు. నేను శారీ కడితే ఎలా ఉంది అంటు వయ్యారంగా వాకింగ్‌ చేస్తూ అలరించారు.

యుద్ధానికి నువ్వు రెడీనా? ట్రెజర్‌ హంట్‌



అచ్చం యుద్ధంలో పాల్గొనే మిలిటరీని తలపిస్తూ విద్యార్థులు యుద్ధానికి నువ్వు రెడీనా? నేను రెడీ అంటూ శత్రువులపై తలపడేందుకు పోటీ పడ్డారు. నిట్‌ లిటరరీ అండ్‌ డిబేట్‌క్లబ్‌ సారథ్యంలో ఏర్పాటు చేసిన ట్రెజర్‌ హంట్‌లో విద్యార్థులు సైనికుల మాదిరి వస్త్రధారణతో ఆకట్టుకున్నారు.

21న 'భారత్‌ గౌరవ్‌' యాత్ర

● జనగామ, కాజీపేట, వరంగల్‌ మీదుగా స్పెషల్‌ టూరిస్ట్‌ రైలు



మాట్లాడుతున్న కిశోర్‌ సత్య

కాజీపేట రూరల్‌/జనగామ: దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు దక్షిణ మధ్య రైల్వే ఈనెల 21న సికింద్రాబాద్‌ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు 'భారత్‌ గౌరవ్‌' స్పెషల్‌ టూరిస్ట్‌ రైలు యాత్ర(జ్యోతిర్లింగాల దర్శనం) ప్రారంభం కాబోతుందని ఐఆర్‌సీటీసీ టూరిజం మానిటర్‌ కొక్కుల ప్రశాంత్‌, సౌత్‌ సెంట్రల్‌ జోన్‌ టూరిజం జాయింట్‌ జనరల్‌ మేనేజర్‌ కిశోర్‌ సత్య తెలిపారు. ఈ మేరకు శనివారం వారు కాజీపేట జంక్షన్‌, జనగామలో మాట్లాడుతూ పుణ్యక్షేత్రాలు అరుణాచలం, రామేశ్వరం, మధురై, శ్రీరంగం, కన్యాకుమారి, తిరుచ్చి, త్రివేండ్రం (అనంత పద్మనాభ స్వామి), తంజావూర్‌ తదితర క్షేత్రాలను సందర్శిస్తారన్నారు. సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ నుంచి ప్రారంభమై భువనగిరి, జనగామ, కాజీపేట వరంగల్‌, మహబూబాబాద్‌, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా ప్రయాణం సాగుతుందని తెలిపారు. ఇందులో స్లీపర్‌, థర్డ్‌, సెకండ్‌ ఏసీలో ప్రయాణం చేసేందుకు వెసులుబాటు కల్పించామన్నారు. ఎనిమిది రాత్రులు, తొమ్మిది రోజుల పర్యటన కోసం టికెట్‌ ధర రూ.14,250తో ప్రారంభమవుతుందన్నారు. ఇందులో పిల్లలకు స్లీపర్‌ కోచ్‌ రూ.14,250, థర్డ్‌ ఏసీ రూ.21,880, సెకండ్‌ ఏసీ రూ. 28,440 ధర నిర్ణయించామన్నారు. ఈ యాత్రలో రోజుకు మూడుసార్లు భోజన వసతితో పాటు ప్రతి కోచ్‌లో భక్తుల సేవాకార్యం గురించి ఐఆర్‌ సీటీసీ సిబ్బంది అందుబాటులో ఉంటారు. దక్షిణ మధ్య రైల్వేశాఖ చేపట్టిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్‌ irctctourism.com లేదా 9281030749, 9989676794, 9701360701, 9281030711/12 నంబర్లను సంప్రదించగలరని వారు తెలిపారు.

డాక్టర్‌ సుమంత్‌రెడ్డి మృతి

● ఎంజీఎంలో చికిత్స పొందుతూ కన్నుమూత
● కన్నీటి వీడ్కోలు పలికిన కుటుంబీకులు, బంధువులు, స్థానికులు



డాక్టర్‌ సుమంత్‌రెడ్డి (ఫైల్‌)

ఖిలా వరంగల్‌/కాజీపేట: డాక్టర్‌ గాదె సుమంత్‌ రెడ్డిపై హత్యాయత్నం కేసు వరంగల్‌లో సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో ప్రాణాపాయస్థితికి చేరుకున్న సుమంత్‌రెడ్డి.. సికింద్రాబాద్‌ యశోద ఆస్పత్రిలో మెరుగైన చికిత్స పొందినప్పటికీ 8 రోజులుగా మృత్యువుతో పోరాడి చివరికి ఓడిపోయాడు. యశోద నుంచి సుమంత్‌ రెడ్డిని శుక్రవారం ఉదయం వరంగల్‌ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు అర్ధరాత్రి మృతి చెందాడు. సుమంత్‌ రెడ్డి మృతదేహానికి శనివారం పోస్టుమార్టం పూర్తి చేసి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు ప్రజల సందర్శనార్థం కాజీపేట సిద్ధార్థనగర్‌లోని తమ ఇంటితోపాటు కాజీపేటలోని క్లినిక్‌కు తరలించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాన్ని సంగారెడ్డికి తరలించారు. కాగా, వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంగా తన భర్త అడ్డు తొలగించుకోవాలని భార్య ఫ్లోరా ప్లాన్‌ మేరకు గత నెల 20వ తేదీన రాత్రి 10.30 గంటలకు ప్రియుడు శామ్యూల్‌, ఏఆర్‌ కానిస్టేబుల్‌ రాజ్‌కుమార్‌.. వైద్యుడు సుమంత్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన విషయ విధితమే.

నిందితులపై హత్య కేసు నమోదు

సుమంత్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులపై తొలుత హత్యాయత్నం కేసు నమోదైంది. అయితే సుమంత్‌ రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందగా.. ముగ్గురు నిందితులపై శనివారం హత్యకేసుగా మార్పు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌ వెంకటరత్నం తెలిపారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

● నిందితుడిపై పోక్సో కేసు నమోదు

గీసుకొండ: వరంగల్‌ జిల్లా గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్‌ పార్కు(కేఎంపీటీ)లో నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం జరిగింది. గీసుకొండ సీఐ మహేందర్‌ కథనం ప్రకారం.. కేఎంటీపీలోని గణేశా ఎకోపెట్‌ కంపెనీలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దంపతులు పని చేస్తున్నారు. అలాగే, నేపాల్‌కు చెందిన రాజు అనే వ్యక్తి కూడా అదే కంపెనీలో పని చేస్తున్నాడు. వారు కంపెనీలో కార్మికుల కోసం కేటాయించిన గదుల్లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం ఉత్తర్‌ప్రదేశ్‌ దంపతుల్లో భర్త కంపెనీలో పనికి వెళ్లగా అతడి భార్య, నాలుగేళ్ల కూతురు ఇంటి వద్ద ఉన్నారు. వారికి సమీపంలో ఉన్న రాజు ఆ బాలికకు కూల్‌ డ్రింక్‌ ఇస్తానంటూ మాయమాటలు చెప్పి తన గదికి తీసుకెళ్లాడు. లైంగికదాడికి యత్నించగా ఆ బాలిక ఏడవడంతో తల్లి, సమీపంలోని వారు అక్కడికి చేరుకున్నారు. దీంతో రాజు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టీజీ ఎన్పీడీసీఎల్‌కు పీఎస్‌యూ లీడర్‌ షిప్‌ అవార్డు



సీఎండీ వరుణ్‌ రెడ్డికి అవార్డు అందజేస్తున్న ఇన్‌చార్జ్‌ డైరెక్టర్లు, కంపెనీ సెక్రటరీ

హన్మకొండ : తెలంగాణ ఉత్తర విద్యుత్‌ పంపిణీ మండలి పీఎస్‌యూ లీడర్‌ షిప్‌ అవార్డు అండ్‌ ఇన్నోవేషన్‌ ఇన్‌ ఆపరేషనల్‌ ఎక్స్‌లెన్స్‌ అవార్డు అందుకుంది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్‌ కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, అసిస్టెంట్‌ సెక్రటరీ ఎం.వి.రమణారెడ్డి అందుకున్నారు. ఈ అవార్డును శనివారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కర్నాటి వరుణ్‌ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్‌ వినియోగదారులందరికీ వినూత్న సేవలు అందించడంతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకుంటూ మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ సేవలు అందిస్తున్నందుకు ఈ అవార్డు దక్కిందన్నారు. ఎన్పీడీసీఎల్‌లో తీసుకొచ్చిన నూతన విధానాలు అమలుతో వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.ఈ అవార్డును స్ఫూర్తిగా తీసుకుని అధికారులు, ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో పని చేద్దామని పిలుపునిచ్చారు. ఇన్‌చార్జ్‌లు బి.అశోక్‌ కుమార్‌, టి.సదర్‌ లాల్‌, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్‌, సి.ఈలు కె.తిరుమల్‌ రావు, బీకం సింగ్‌, రాజు చౌహాన్‌, రవీంద్రనాథ్‌, వెంకటరమణ, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, జాయింట్‌ సెక్రటరీ రమేశ్‌ , డీ.ఈ అనిల్‌ కుమార్‌ పాల్గొన్నారు.

దారికాచిన మృత్యువు..

● సైకిల్‌ను ఢీకొన్న హైడ్రాలిక్‌ వాహనం
● తండ్రి, తనయుడి దుర్మరణం
● కోతులనడుమలో ఘటన





రాజేశ్వర్‌రావు(ఫైల్‌) వికాస్‌రావు (ఫైల్‌)

ఎల్కతుర్తి : సైకిల్‌పై బంధువుల ఇంటికి వెళ్తున్న తండ్రి, కుమారుడిని మృత్యువు కబళించింది. హైడ్రాలిక్‌ క్రేన్‌ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. హనుమకొండ–కరీంనగర్‌ ప్రధాన రహదారిపై శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కోతులనడుమ గ్రామానికి చెందిన తంగెడ రాజేశ్వర్‌రావు (65) తన కుమారుడు వికాస్‌రావు (21)తో కలిసి సైకిల్‌పై వల్బాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో హుజూరాబాద్‌ నుంచి ఎల్కతుర్తి వైపునకు వెళ్తున్న హైడ్రాలిక్‌ క్రేన్‌ వాహనం అతివేగంగా వచ్చి ఢీకొనడంతో తండ్రి, కొడుకుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. తండ్రి, కుమారుడి మృతితో ఆ కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రూ. 3.50 లక్షల మిర్చి బూడిద

● పంట కుప్పకు నిప్పుపెట్టిన దుండగులు



కాలి బూడిదైన మిర్చి పంట

భూపాలపల్లిరూరల్‌ : రైతు ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంట.. మంటల్లో దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం రాత్రి భూపాలపల్లి మండలం దూదేకులపల్లిలో చోటుచేసుకుంది. బాధిత రైతు అజ్మీరా పరంసింగ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పరంసింగ్‌ తనకున్న 4 ఎకరాల భూమిలో మిర్చి పంట సాగుచేశాడు. ఆ పంట చేతికొచ్చిన అనంతరం తెంపి కల్లంలో ఆరబెట్టాడు. కొన్ని రోజులు ఎండిన తర్వాత తాలు, మేలు కాయలు వేరుచేసి కుప్ప పోశాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వరకూ మిర్చి కుప్పవద్ద కాపలా ఉన్నాడు. అనంతరం ఇంటికి చేరుకున్నాడు. అర్ధరాత్రి దుండగులు మిర్చి కుప్పకు నిప్పంటించారు. ఈ ఘటనలో సుమారు రూ.3.50 లక్షల విలువైన 16 నుంచి 18 క్వింటాళ్ల పంట కాలిబూడిదైందని పరంసింగ్‌ కన్నీరుమున్నీరయ్యాడు. రూ.లక్షల్లో అప్పు తెచ్చి పంటకు పెట్టుబడి పెట్టానని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించాడు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మహబూబాబాద్‌ రూరల్‌ : రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్‌ రైల్వే స్టేషన్‌ పరి సిగ్నల్‌ కాలనీ ప్రాంతంలో చోటుచేసుకుంది. జీఆర్పీ కానిస్టేబుల్‌ గాంధీ, ఆర్పీఎఫ్‌ కానిస్టేబుల్‌ నాగిరెడ్డి కథనం ప్రకారం.. కాజీపేట వైపు నుంచి ఖమ్మం వైపునకు డౌన్‌ లైన్‌లో షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ వెళ్తోంది. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. లోకోపైలట్‌, స్టేషన్‌ మాస్టర్‌ సమాచారం మేరకు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించగా మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి పోస్టు మార్టం గదికి తరలించి భద్రపరిచామని, ఎవరైనా గుర్తుపడితే జీఆర్పీ, ఆర్పీఎఫ్‌ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

మద్యం తాగొద్దని మందలించినందుకు..

● మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య
● కొత్తతండాలో ఘటన

నర్సింహులపేట: మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని జగ్గుతండా జీపీ పరిధిలోని కొత్తతండాలో చోటు చేసుకుంది. ఎస్సై మాలోత్‌ సురేశ్‌ కథనం ప్రకారం.. తండాకు చెందిన మాలోత్‌ వీరు(50) నిత్యం మద్యం తాగడం, వ్యవసాయ పనులకు వెళ్లకపోవడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన వీరు శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య కాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్‌ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని యువకుడు..

గీసుకొండ: భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మరియపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొలమారి థామస్‌రెడ్డి (36) నాలుగు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన మంజులను వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు కుమారుడు జన్మించారు. మూడు నెలల నుంచి ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో భార్య తన తల్లిగారి ఇంటివద్ద ఉంటోంది. దీంతో థామస్‌రెడ్డి మనస్తాపంతో శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి సోదరి నీలిమ మేరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ సీఐ మహేందర్‌ శనివారం తెలిపారు.

జల్సాల కోసం చోరీలు..

● అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్‌
● వివరాలు వెల్లడించిన టౌన్‌ సీఐ దేవేందర్‌



వివరాలు వెల్లడిస్తున్న టౌన్‌ సీఐ దేవేందర్‌

మహబూబాబాద్‌ రూరల్‌ : జల్సాల కోసం చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు మహబూబాబాద్‌ టౌన్‌ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ పెండ్యాల దేవేందర్‌ వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్‌ మండలం ఇస్లావత్‌ తండా (ఎం) గ్రామానికి చెందిన ఇస్లావత్‌ సురేశ్‌ కొంత కాలంగా మహబూబాబాద్‌, మరిపెడ, ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం, ఏపీలోని విజయవాడ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఫర్టిలైజర్‌ షాపులు, కిరాణం, వస్త్ర, ఇతర దుకాణాల్లో చోరీలకు పాల్పడుతూ జల్సాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం చోరీ చేసిన వస్తువులను మహబూబాబాద్‌లో అమ్మేందుకు వస్తున్నాడు. కురవి గేట్‌ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తున్న మహబూబాబాద్‌ టౌన్‌, సీసీఎస్‌ పోలీసులకు అనుమానం వచ్చి సురేశ్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఇందులో రూ.8,500 విలువైన కిరాణా సామగ్రి, రూ.1,800 నగదు లభించింది. విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకోవడంతో నిందితుడిని అరెస్ట్‌ చేసి సెల్‌ ఫోన్‌, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించిన్నట్లు సీఐ తెలిపారు. కాగా, నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న సీసీఎస్‌ ఇన్‌స్పెక్టర్‌ బి.హతీరాం, టౌన్‌ సీఐ దేవేందర్‌, సీసీఎస్‌ ఎస్సైలు తాహెర్‌ బాబా, గోపి, మహబూబాబాద్‌ టౌన్‌ ఎస్సైలు కె.శివ, బి.విజయ్‌ కుమార్‌, సిబ్బంది రుద్రయ్య, సక్రాం, శ్రీకాంత్‌, ఉపేందర్‌ తదితరులను మహబూబాబాద్‌ డీఎస్పీ తిరుపతిరావు అభినందించారు.